www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 18 | జూన్ | 2026 పేజీలు : 8

## పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లకు బిల్లులివ్వాలి



- జీవనోపాధి వాహనం ఉందనే నెపంతో దరఖాస్తుల తిరస్కరణ సరికాదు
- అధికారుల సమీక్షా సమావేశంలో ఎంఎల్‌ఏ కూనంనేని

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఉమ్మడి కుటుంబాల ఇందిరమ్మ ఇళ్ల పెండింగ్ బిల్లులు, నిర్మాణం పూర్తిచేసుకున్న ఇళ్ల లబ్దిదారులకు బిల్లులు తక్షణమే విడుదల చేసి పేద కుటుంబాల వారిని న్యాయం చేయాలని ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివ రావు అన్నారు. బుధవారం

మిగతా 2లో..

# కలవరపెడుతున్న సర్..!





-ఓటర్లను చైతన్యపర్చే పనిలో రాజకీయ పార్టీలు

-అప్రమత్తమైతే ఓటు పదిలమే

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఇప్పుడు ఎక్కడ చూసినా సర్‌పై చర్చ జరుగుతుంది. ప్రతి ఒక్కరూ మ్యాపింగ్ పైన, ఓటు భద్రత పైనా చర్చించుకుంటున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ దీనినే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) అంటున్నారు. సర్ ద్వారా పలు రాష్ట్రాల్లో లక్షలాది ఓట్లు తొలగించడమే సర్‌పై ఇంతటి చర్చకు కారణమైంది. 2002 నాటి ఓటర్ల జాబితాతో సరిపోలని ఓట్లను పక్కనపెడుతున్నారని వీరు ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని రాజకీయ పార్టీలు ఆరోపిస్తున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో సుమారు 80లక్షల ఓట్లు మ్యాపింగ్ జరగలేదని 2002 జాబితాతో పోల్చి చూసినప్పుడు సగం మంది కూడా స్థానికంగా ఉండడం లేదని బిఎల్‌వోల సర్వేలలో వెల్లడవుతున్నట్లు తెలుస్తుంది. అయితే బిఎల్‌వోల సర్వేకు సంబంధించి కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంటింటికి తిరగడం లేదని గతంలో ఎక్కడ ఓట్లు ఉన్నాయి అనే దానిపై ఓటర్ల నుంచి ఆధారాలు సేకరించడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అత్యంత కీలకంగా వ్యవహరించాల్సిన బిఎల్‌వోల పనితీరుపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి ఉంది. ఖమ్మం నగరంతో పాటు పలు గ్రామాల్లో బిఎల్‌వోలు ఇంటింటి సర్వే చేయకపోవడంతో ఓటర్లు తమ ఓట్లు ఉంటాయా పోతాయా అన్న ఆందోళనలో ఉన్నారు. బిఎల్‌వోల సెల్‌ఫోన్ నెంబర్ల కోసం పలువురు ఇతరులను సంప్రదించడం జరుగుతున్నది.

**అప్రమత్తమైన రాజకీయ పార్టీలు :**

బిజెపి సర్ ద్వారా రాజకీయ లబ్ది పొందెందుకు ప్రయత్నిసుందని పశ్చిమబెంగాల్, బీహార్, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో సర్‌ను సాకుగా చూపి లక్షలాది ఓటర్లను జాబితా నుంచి తొలగించారని

మిగతా 2లో..

## పేదల ఆశలపై రుణాల ఉచ్చు..!

-ఇల్లు పేదలది.. లాభం ఫైనాన్స్ మాఫియాది..

-ప్రభుత్వ ఇళ్లకూ రుణాలు ఇప్పించి లక్షలు గుంజుతున్న ముఠాలు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గంలో హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీల ఆగడాలు రోజురోజుకూ పెరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూముల్లో నిర్మించుకున్న ఇళ్లు, డబుల్ బెడ్‌రూం గృహాలు, వివాదాస్పద ఆస్తులకూ అక్రమ మార్గాల్లో రిజిస్ట్రేషన్లు నిర్వహించి భారీ రుణాలు మంజూరు చేయిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పేదల ఆర్థిక బలహీనతను ఆసరాగా చేసుకుని కొంతమంది ఫైనాన్స్ సంస్థల సిబ్బంది ధనార్జనే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. స్థానికంగా పనిచేస్తున్న కొన్ని హౌసింగ్ ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులు రిజిస్ట్రేషన్‌కు అయ్యే ఖర్చును తామే భరిస్తామని చెప్పి, పేదలను ఆకర్షిస్తున్నట్లు తెలుస్తోంది. మీరు ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదు... అన్ని మేమే చూసుకుంటాం అంటూ నమ్మించి రుణాలు ఇప్పిస్తున్నట్లు సమాచారం. అయితే రుణం విడుదలైన తర్వాత లక్షకు రూ.2 వేల చొప్పున కమీషన్ వసూలు చేయడంతో పాటు, ప్రభుత్వ చలానాలు, రిజిస్ట్రేషన్ ఖర్చులు, వడ్డీ పేర్లతో ఒక్కో ఫైలుపై రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ.4 లక్షల ఇంటికి రూ.10 లక్షల రుణమా...? మార్కెట్ విలువ తక్కువగా ఉన్న ఇళ్లకు అధిక మొత్తంలో రుణాలు మంజూరు కావడం పలు అనుమానాలకు తావిస్తోంది. రూ.4 లక్షల విలువ చేసే ఇంటికి రూ.10 లక్షల వరకు రుణాలు మంజూరు కావడం వెనుక భారీ స్థాయిలో అక్రమాలు జరిగి ఉండొచ్చనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రుణాల మంజూరులో నిబంధనలు ఎంతవరకు పాటిస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మండల పరిధిలోని ఓ గ్రామంలో టిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు అక్రమ మార్గంలో రిజిస్ట్రేషన్లు చేపించిన మాఫియా ఒక్కో ఇంటికి రూ.10 నుండి 15 లక్షల వరకు రుణాలు ఇప్పించింది. కొసమెరుపు ఏమిటంటే అదే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ప్రస్తుతం రూ. ఐదు లక్షలకే అమ్మకాలు కొనసాగుతున్నడం విశేషం. ఈఎంఐల భారంతో పేదలపై ఆర్థిక ఉచ్చురుణం తీసుకునే వ్యక్తి నెలవారీ ఆదాయం ఎంత...? , ఈఎంఐ చెల్లించే సామర్థ్యం ఉందా..?, ఆదాయ వనరులు ఏమిటి...?,

మిగతా 2లో..

## సంక్షేమం దారి తప్పింది..



-రాష్ట్ర ఆదాయం తగ్గి, మంత్రుల ఆదాయం పెరిగింది

-వచ్చే ఎన్నికల్లో గెలుపు మనదే

-బిఆర్ఎస్ నేత కేటిఆర్

**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్ :** రాష్ట్రంలో సంక్షేమం ఆగమైందని అదే సందర్భంలో అభివృద్ధి పూర్తిగా ఆగి పోయిందని బిఆర్ఎస్ కార్యనిర్వహక అధ్యక్షులు, మాజీ మంత్రి కేటి రామారావు తెలిపారు. మంత్రులు రాష్ట్ర ప్రజల గురించి పట్టించుకోకుండా సొంత ఆదాయాల పెంపుపై దృష్టిసారించారని ఖమ్మం జిల్లాలో ఉన్నది ముగ్గురు మంత్రులు కాదని వారు మోసగాళ్లని ఆయన ఆరోపించారు. బుధవారం పాలేరు నియోజక వర్గం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని హర్ష ఫంక్షన్ హాల్‌లో జరిగిన పాలేరు నియోజక వర్గ బూత్ స్థాయి ప్రతినిధుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటిఆర్ మాట్లాడుతూ కేసిఆర్ అప్పు చేసి రాష్ట్రంలో అనేక ప్రాజెక్టులు నిర్మించడంతో పాటు సంక్షేమ పథకాలను అమలు చేశారని కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హిట్లర్ తనకు ఆదర్శమని చెబుతున్నారని అదే స్ఫూర్తితో రాష్ట్రంలో పేదల ఇండ్లను కూల్చివేస్తున్నారని కేటిఆర్ ఆరోపించారు. హిట్లర్‌కు రావణాసురుడు, రాక్షసుడు వంటి బిరుదులు ఉన్నాయని అటువంటి వ్యక్తిని ఆదర్శంగా తీసుకోవడంతో రేవంత్‌రెడ్డి మనస్థత్వం ఆయన పనితీరు అవగతమవుతుందన్నారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమాన్ని మరిచి తమ ఆదాయాన్ని పెంచుకుంటూ స్వలాభాలకు ప్రాధాన్యతనిస్తున్నారన్నారు.

మిగతా 2లో..

# కలవరపెడుతున్న 'సర్'..!

**(మొదటిపేజీ తరువాయి)** బిజెపియేతర పార్టీలు ఆరోపిస్తున్నాయి. పశ్చిమబెంగాల్, బీహార్‌లో ఓట్ల తొలగింపు కారణంగానే బిజెపి అధికారంలోకి వచ్చిందన్న ఆరోపణలు వ్యక్తమైన విషయం విధితమే. తెలంగాణలో మాత్రం దీనిపై రాజకీయ పార్టీలు అప్రమత్తమై ఓట్లను కాపాడుకునేందుకు ఓటర్లను చైతన్యపరుస్తున్నారు. వామపక్షాలతో పాటు కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీలు బూత్ స్థాయి సమావేశాలు నిర్వహించి సర్‌పై అవగాహన కలిగిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటు చేజారకూడదన్న భావనతో రాజకీయ పార్టీలు పని చేస్తున్నాయి. దీనికి సంబంధించి సిపిఐ రాష్ట్ర స్థాయిలో మేధావులతో ఒక అవగాహన సదస్సును నిర్వహించింది.

**ఇవి ఉంటే సరిపోతుంది :**

2002 ఓటరు జాబితాలో ఓటు ఉన్న ఆధారం దొరకని పక్షంలో ఓటును కాపాడుకోవడం ఎలా అన్న దానిపై కొందరిలో సందిగ్ధత ఉంది. 2002 తర్వాత ఓటు హక్కు పొందిన వారు స్థానికులు అనే విషయాన్ని రుజువు చేసుకోవాల్సి ఉంటుంది. 2002 నాటికి ఓటరు జాబితాలో పేరు ఉండి ఇప్పుడు అక్కడ స్థానికంగా లేకుండా వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారు పాసుపోర్టు కానీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల గుర్తింపు కార్డు, 1987 కంటే ముందు ప్రభుత్వం లేదా స్థానిక సంస్థలు బ్యాంకులు, ఎల్‌ఐసి జారీ చేసిన ఆధారాలు కానీ చూపి ఓటును కాపాడుకోవచ్చు. సాధికారత సంస్థ జారీ చేసిన జనన ధృవీకరణ పత్రం కానీ కుల ధృవీకరణ పత్రం, విశ్వ విద్యాలయాలు గుర్తింపు పొందిన బోర్డు జారీ చేసిన విద్యా ధృవీకరణ పత్రం లేదా అధికారులు జారీ చేసిన నివాస ధృవీకరణ పత్రం, అటవీ హక్కుల పత్రం, జాతీయ గుర్తింపు కార్డు ఉంటే బిఎల్‌వోలకు చూపవచ్చు. స్థానిక అధికారుల ద్వారా రూపొందించిన కుటుంబ గుర్తింపు పత్రం కానీ, ప్రభుత్వం ద్వారా జారీ అయినా భూమి లేదా భూ కేటాయింపు పత్రం కానీ చూపి ఓటును కాపాడుకోవచ్చు. అయితే ఓటర్లు దీనిపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. మ్యాపింగ్ తదనంతర ప్రక్రియలో బిఎల్‌వోలతో సంప్రదిస్తూ తాము ఉన్న ప్రాంతంలో ఓటరు జాబితాలో పేరు ఉండేవిధంగా చూసుకోవాలి. లేని పక్షంలో మీ ఓటుకు ప్రమాదమే.

# సంక్షేమం దారి తప్పింది..




**(మొదటిపేజీ తరువాయి)** మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన ఆదాయాన్ని పెంచుకోవడం తప్ప మరో పని లేదని కేటిఆర్ ఆరోపించారు. తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెడుతూ తన అనుచరులతో దందాలు చేస్తున్నారని ఆరోపించారు. భట్టివిక్రమార్క కమిషన్లకు తెర లేపారని ఇందులో పొంగులేటి ముందు వరుసలో ఉన్నారని మంత్రిపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి వీడియోను కేటిఆర్ చూపించారు. హైదరాబాద్‌లో భూ వివాదానికి సంబంధించి పొంగులేటి కుమారుడు ఉన్నాడని కేసు నమోదైతే అక్కడి పోలీస్ అధికారిని సైతం బదిలీ చేయించారని ఆయన తెలిపారు. పాలేరు నియోజకవర్గంలో ప్రతి ఓటరుకు పొంగులేటి అవినీతి గురించి వివరించాలన్నారు. ఆయన బిసి మంత్రులను, అధికారులను లెక్కచేయడం లేదని ఉన్నతాధికారులను సైతం నాన్సెన్స్ అంటూ వ్యాఖ్యానిస్తున్నారని కేటిఆర్ తెలిపారు. కాంగ్రెస్ మీద వ్యతిరేకతతో కాకుండా పార్టీ సంస్థాగతంగా బలపడటం ద్వారా అధికారంలోకి రావాలని కేటిఆర్ సూచించారు. ప్రతి కార్యకర్త సైనికులా పని చేయాలని కోరారు. సర్‌కు సంబంధించి డిజిటల్ ప్రదర్శన ద్వారా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌సి తాతా మధుసూదన్, ఉమ్మడి జిల్లా ఇంచార్జి తక్కెళ్లపల్లి రవీంద్రరావు, రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డి, మాజీ ఎంఎల్‌ఎలు కందాళ ఉపేందర్‌రెడ్డి, మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, బిఆర్‌ఎస్ నాయకులు లింగాల కమల్‌రాజు, బొమ్మెర రామ్మూర్తి, బెల్లం వేణు, ఇంటూరి శేఖర్, బ్రహ్మయ్య, వీరన్న, వరప్రసాద్ పాల్గొన్నారు.

# నారి బేటిని జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ ఖమ్మం టౌన్ :** ఈనెల 21న ఖమ్మం నగరంలో జరిగే నారి బేటిని జయప్రదం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో నారి బేటికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, మహిళా నాయకులతో నూతి సత్యనారాయణ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21న సప్తపది ఫంక్షన్ హాల్‌లో జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య అధ్యక్షతన నారి బేటి సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశానికి మహిళా కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ మహిళా ప్రజాప్రతినిధులు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి మహిళలందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు దామా స్వరూప, మహిళా కాంగ్రెస్ నాయకులు బలుసు లక్ష్మి , ఊరుకొండ చంద్రిక, రేఖా భార్గవి, గోవిందమ్మ, మంగ, బొడ్డు బొందయ్య, కిలారు అనిల్‌కుమార్, కొట్టే రాజశేఖర్, మద్దినేని రమేష్ పాల్గొన్నారు.

# పేద కుటుంబాలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం : పాయం




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** పేద, మధ్య తరగతి కుటుంబాల ఆర్థిక భారం తగ్గించి వారి జీవితాల్లో భరోసా నింపడమే రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ విధానాల లక్ష్యమని పినపాక ఎంఎల్‌ఎ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని సారపాకలోని వాసవి ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్‌ఎఫ్)చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా 34 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల చెక్కులు అందజేయగా, 25 మంది లబ్దిదారులకు రూ 13లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. చెక్కులు అందుకున్న లబ్దిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఎ పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజంలోని బలహీన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. ఆడబిడ్డల వివాహాల కోసం కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలు ఎంతో ఉపయోగకరంగా మారాయని, అలాగే ఆర్థికంగా వెనుబడిన కుటుంబాలకు వైద్య చికిత్సల కోసం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా అందుతున్న సహాయం అండగా నిలుస్తోందన్నారు. సంక్షేమ పథకాలు కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాకుండా పేద కుటుంబాలకు ఆత్మవిశ్వాసాన్ని కల్పిస్తున్నాయని, ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని స్పష్టం చేవారు. ఈకార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్దిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లకు బిల్లులివ్వాలి

**(మొదటిపేజీ తరువాయి)** పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణశాఖ అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ఉమ్మడి కుటుంబంలో నివశిస్తూ సొంత ఇల్లు లేని లబ్దిదారుల పేమెంట్లను సాంకేతిక కారణాలతో నిలిపేయడం సరికాదన్నారు. గతంలో ఇల్లు ఉండి ప్రస్తుతం శిథిలావస్థలో చేరిన వారిని కూడా ఆదుకోవాలన్నారు. 600 చదరపు అడుగు నిబంధనతో సమ్మతి పత్రాల పేరిట బిల్లులు ఆపవద్దని ఆదేశించారు. జీవనోపాధి కోసం నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయనే కారణంతో దరఖాస్తులను తిరస్కరించడం తగదని, క్షేత్రస్థాయి పరిశీలన నివేదికలు స్పష్టంగా ఉండాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో బేస్,రూఫ్, స్లాబ్ లెవల్ వరకు ఇళ్లు నిర్మించుకుని బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి వెంటనే నిధులు విడుదల చేయాలని స్పష్టం చేశారు. ఇళ్లు మంజూరై ఇప్పటి వరకు పనులు ప్రారంభించని వారి నుండి నాన్ విల్లింగ్ పత్రాలు తీసుకోవాలని, మొదటి విడతలో మిగిలిపోయిన 199 మంది పేర్లను త్వరగా మంజూరీ చేయాలని ఆధికారులకు సూచించారు. రెండో విడతకు ఇందిరమ్మ ఇళ్ల వివరాల సేకరణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, కాంగ్రెస్ నాయకులు నాగసీతారాములు, మేయర్ మూడ్ గణేష్, హోసింగ్ ఇంచార్జ్ పిడి సవేరామ్, డిఇ ఖలీల్, తహశిల్దార్ పుల్లయ్య, ఎంపిడిఓలు సుభాషిణి, సుస్మిత, భారతి, ఏఇలు రమేష్‌బాబు, హాసిత, బాధిత లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆశలపై రుణాల ఉచ్చు..!

**(మొదటిపేజీ తరువాయి)** వంటి అంశాలను పరిశీలించకుండా విచక్షణారహితంగా రుణాలు మంజూరు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఫలితంగా నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఈఎంఐలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడి, అనేక కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. ఈఎంఐల భారం మోయలేక కుటుంబ కలహాలు పెరుగుతున్నాయని, కొన్ని సందర్భాల్లో భార్యాభర్తల మధ్య విభేదాలు తీవ్రరూపం దాల్చుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే సామాజిక సమస్యలు మరింత తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉందని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

**అధికారుల పర్యవేక్షణ ఎక్కడ...?**

అక్రమ రిజిస్ట్రేషన్లు, అనుమానాస్పద రుణాల మంజూరు, ప్రభుత్వ భూములపై ఆస్తుల లావాదేవీలు జరుగుతున్నాయనే ఆరోపణల మధ్య సంబంధిత శాఖల పర్యవేక్షణపై ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రిజిస్ట్రేషన్ శాఖ, రెవెన్యూ శాఖ, ఫైనాన్స్ సంస్థల నియంత్రణ సంస్థలు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని ప్రజలు కోరుతున్నారు. పేదల అభివృద్ధికి ఉపయోగపడాల్సిన రుణ వ్యవస్థ, కొందరి చేతుల్లో దోపిడీ సాధనంగా మారితే దాని భారాన్ని చివరకు భరించేది నిరుపేదలేనని సామాజిక వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. అక్రమాలకు అడ్డుకట్ట వేయకపోతే సత్తుపల్లి ప్రాంతంలో హౌసింగ్ ఫైనాన్స్ మాఫియా మరింత బలపడే ప్రమాదం ఉందని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

# అంబులెన్స్‌లోనే పండంటి మగబిడ్డకు జన్మ..

## -సమయస్ఫూర్తితో తల్లీబిడ్డను కాపాడిన 108 సిబ్బంది



**ప్రజాపక్షం/బూర్గంపాడు :** పురిటి నొప్పులతో బాధపడు తున్న ఓ గర్భిణికి 108 అంబులెన్స్ సిబ్బంది దేవుడిలా మారి సురక్షిత ప్రసవం నిర్వహించిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చోటు చేసుకుంది. బూర్గంపాడు మండలం రామాపురం గ్రామానికి చెందిన ఎస్ తులస మ్మకు బుధవారం ఆకస్మాత్తుగా పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108సేవలకు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది గర్భిణిని భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలోనే నొప్పులు తీవ్రం అయ్యాయి. భద్రాచలం వంతెనపైకి చేరుకునే సమయానికి ప్రసవం తప్పని సరి కావడంతో అంబులెన్స్‌లోనే అత్యవసరంగా ప్రసవం నిర్వహించారు. ఈసమయంలో 108ఈఎంటీ ఎం జ్యోతి అసాధారణ ధైర్యం, సమయస్ఫూర్తితో వ్యవహరించి తులసమ్మకు సురక్షితంగా ప్రసవం చేయగా, పైలెట్ మేకల రామకృష్ణ అవసరమైన సహకారం అందించారు. కొద్ది క్షణాల ఉత్కంఠ అనంతరం తులసమ్మ పండంటి మగబిడ్డకు జన్మనివ్వడంతో కుటుంబ సభ్యులు ఆనందంలో మునిగిపోయారు. తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉండటంతో అనంతరం వారిని భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అత్యవసర సమయంలో అప్రమత్తంగా స్పందించి సురక్షిత ప్రసవం నిర్వహించిన 108 సిబ్బందిపై కుటుంబ సభ్యులు, స్థానికులు ప్రశంసలు కురిపించారు.

# విద్యార్థులకు అక్షరాభ్యాసం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలో 11వ వార్డు సోమవరంలో వార్డు కౌన్సిలర్ దొంతెబోయిన వెంకటేశ్వర్లు విద్యార్థులకు అక్షరభ్యాసం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలకతో అక్షరాభ్యాసంను ఆయన చేయించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ లీలా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# భూక్యా కమలమ్మకు నివాళి



**ప్రజాపక్షం/వైరా:** వైరా నియోజకవర్గ సిపిఎం కార్యదర్శి భూక్యా వీరభద్రం తల్లి భూక్యా కమలమ్మ మరణించిన విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు, వనమా విశ్వేశ్వరరావు, బాణాల వెంకటేశ్వర్లు, నూకల వాసు, ఖమ్మం రూరల్ మండలం కాప్లాతండా వెళ్లి భూక్యా కమలమ్మకు చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం భూక్యా వీరభద్రంను వారు పరామర్శించారు.

# ఆదర్శ కమ్యూనిస్టు పెరిక ప్రభాకర్

## సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం



**ప్రజాపక్షం/చింతకాని :** బ్రతికినంతకాలం ఎత్తిన ఎర్రజెండా చేతపట్టిన పెరిక ప్రభాకర్ ఆదర్శ కమ్యూనిస్టుగా బ్రతికాడని సీపీఐ జాతియ సమితి సభ్యులుభాగం హేమంతరావు అన్నారు. నేరడ గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకులు పెరిక ప్రభాకర్ ప్రదమ వర్ధంతి సభ మంగళవారం శాఖ కార్యాదర్శి షేక్ దస్తగిరి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో భాగం హేమంతరావు మాట్లాడుతూ నేరడ ఆభివృద్ధిలో ప్రభాకర్ పాత్ర ఎనలేనిదన్నారు. నిత్యం ప్రజాసమస్యలే ఎజెండాగా పనిచేసేవాడన్నారు.ఈ ప్రాంతంలో కమునిస్టు ఉద్యమం బలపడటానికి ప్రభాకర్ పాత్ర ఎనలేనిదన్నారు.దూసరి కుటుంబానికి ప్రధాన అనుచరుడిగా ఉంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి చురుగ్గా తీసుకెళ్ళేవాడన్నారు.పార్టీ గ్రామశాఖ కార్యదర్శిగా,మండలకార్యవర్గ సభ్యులుగా , వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడిగా , జన్‌సేవాదళ్ సభ్యుడిగా పార్టీ ఎదుగుదలకు చేసిన కృషి మరువలేనిదన్నారు. ప్రభాకర్ కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యదర్శి జుమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లిఖార్జునరావు పార్టీ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు , గోగుల ఆది, గునుగుంట్ల వెంకన్న, మట్టా రవి, మహేష్, కోట వీరయ్య , ప్రభాకర్ , దొనె వెంకన్న, అంతోని, ప్రభాకర్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు ఓటు హక్కు కల్పించాలి

## -ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ 100 శాతం చేపట్టాలి
## -ఎస్ఐఆర్‌పై కలెక్టర్ సమావేశం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ నాయకుల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై కలెక్టర్ దివాకర టిఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ఈనెల 25 నుంచి ప్రారంభం కానుందన్నారు. రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం చేయాలని, ఇంకను నియామకం చేయని రాజకీయ పార్టీలు వెంటనే ప్రక్రియ పూర్తి చేసి జాబితా సమర్పించాలన్నారు. బూత్ స్థాయి అధికారులతో బూత్ స్థాయి ఏజెంట్లు ఇంటింటి ఎన్యూమరేషన్‌లో పాల్గొనాలన్నారు. ఇంకను మ్యాపింగ్ కాని వారి నుండి 11 రకాల ధృవీకరణలో ఏది ఉన్న సేకరించి బూత్ స్థాయి అధికారికి అందజేయాలన్నారు. 1987 కంటే ముందు పుట్టిన వారు సొంతంగా, 1987 నుండి 2004 మధ్యలో పుట్టిన వారు సొంతంతో పాటు తల్లిదండ్రుల్లో ఒకరి, 2004 తర్వాత పుట్టిన వారు సొంతంతో పాటు తల్లిదండ్రులు, తాత, నాయనమ్మల ధృవీకరణలు ఆధార్‌తో పాటు సమర్పించాల్సి ఉంటుందన్నారు. బూత్ స్థాయి అధికారులు బూత్ స్థాయి ఏజెంట్లు జూన్ 25 నుంచి ఇంటింటికి తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలు రెండు కాపీలు నింపి ఒకటి ఓటరుకు ఒకటి బూత్ స్థాయి అధికారుల వద్ద ఉంచుకోవాలన్నారు. మ్యాపింగ్ అయిన వారు ఎటువంటి డాక్యుమెంట్ సమర్పించాల్సిన అవసరం లేదని మ్యాపింగ్ కాని వారు 11 రకాల ధృవీకరణలో ఏదో ఒకటి సమర్పించాలన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో ప్రజలు భాగస్వామ్యం అవ్వాలని అందుకు విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ట్రైనీ కలెక్టర్ పారాస్ కుమార్, ఖమ్మం ఆర్డివో శ్రీనివాస్, ఎస్‌డిసి సదానందం, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎంఎ రాజు, డిటి అన్సారీ, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ వ్యాధి తప్పనిసరిగా నివేదించాల్సిన వ్యాధిగా ప్రకటింపు

## -జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డి రామారావు



**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ జిఓ ఎంఎస్ నెం 17, (తేది 06.04.2026) ద్వారా క్యాన్సర్ వ్యాధిని రాష్ట్ర వ్యాప్తంగా తప్పనిసరిగా నివేదించాల్సిన వ్యాధిగా ప్రకటించినట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి రామారావు తెలిపారు. రాష్ట్రంలో క్యాన్సర్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో, క్యాన్సర్ వ్యాధి వ్యాప్తి మరణాల రేటు, చికిత్స ఫలితాలు, భౌగోళిక వ్యత్యాసాలు, ప్రమాద కారకాలపై ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించి ప్రజారోగ్య ప్రణాళికలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ప్రభుత్వ, ప్రవేట్, స్వయంప్రతిపత్తి సంస్థల ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలు, ఈఎస్ఐ, రైల్వే, రక్షణ శాఖ ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్స్, క్యాన్సర్ చికిత్స కేంద్రాలు, పాథాలజీ మరియు రేడియాలజీ ల్యాబ్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ఆరోగ్య భీమా సంస్థలు, జనన మరణాల నమోదు కార్యాలయాలు మరియు సంబంధిత ఇతర సంస్థలు తమ వద్ద నిర్ధారణ అయిన ప్రతి క్యాన్సర్ కేసును వ్యాధి నిర్ధారణ జరిగిన ఒక నెలలోపు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన అన్‌లైన్ పోర్టల్ ద్వారా తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. క్యాన్సర్ రిజిస్ట్రేషన్ ద్వారా వ్యాధి నిర్ధారణ చికిత్స, పాలియేటివ్ కేర్, పునరవాస సేవలు, దీర్ఘకాలిక పర్యవేక్షణ వంటి అంశాలపై సమగ్ర సమాచారం అందుబాటులోకి వచ్చి, రాష్ట్రంలో క్యాన్సర్ నియంత్రణ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. అలాగే జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు, వైద్యులు, ల్యాబొరేటరీలు మరియు సంబంధిత సంస్థలన్నీ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను తప్పనిసరిగా పాటించి, ప్రతి క్యాన్సర్ కేసును సకాలంలో నమోదు చేయాలని డాక్టర్ డి రామారావు కోరారు. క్యాన్సర్ కేసుల నివేదికలను పూర్తి స్థాయిలో అందినప్పుడే వ్యాధి భారాన్ని అంచనా వేసి, అవసరమైన చికిత్స వసతులు, నివారణ చర్యలు, స్క్రీనింగ్ కార్యక్రమాలు మరియు ప్రజారోగ్య విధానాలను మరింత సమర్థవంతంగా రూపొందించవచ్చని ఆయన తెలిపారు.

# పాఠశాలలను తనిఖీ చేసిన అకడమిక్ మానిటరింగ్ అధికారి



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం:** మండలంలోని పలు పాఠశాలలను అకడమిక్ మానిటరింగ్ అధికారి ప్రభాకర్ రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాల, కేజీబీవీ, బనిగండ్లపాడు పాథమిక పాఠశాలను సందర్శించి రికార్డులను, విద్యార్థుల హాజరుపట్టిక. మధ్యాహ్నభోజనం తదితర అంశాలను పరిశీలించి వివరాలను అడిగి తెలసుకున్నారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలను పంపిణీ చేశారు. ఏకరూప దుస్తులు త్వరలోనే పంనిస్తామని, మధ్యాహ్నభోజనంలో నాణ్యత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బి.మురళిమోహన్‌రావు, సీఆర్‌పీ సుభాషిని తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** ప్రీ ప్రైమరీ బోధనకు సంబంధించిన ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల భర్తీకి గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి బి. రాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది నూతనంగా ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణకు మండల పరిధిలోని చిమ్మపుడి, మంచుకొండ, చింతగుర్తి, గణేశ్వరం, రాంక్యాతండా పాఠశాలల్లో మంజూరయ్యాయని తెలిపారు. ఆయా పాఠశాలల్లో ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల భర్తీకి రఘునాథపాలెం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. చిమ్మపుడి పాఠశాలలో ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్‌కు 20 దరఖాస్తులు, ఆయా పోస్టుకు ఎనిమిది దరఖాస్తులు, మంచుకొండలో ఇన్‌స్ట్రక్టర్‌కు 25, ఆయాకు 10, చింతగుర్తిలో ఇన్‌స్ట్రక్టర్‌కు 33, ఆయాకు ఆరు, గణేశ్వరంలో ఇన్‌స్ట్రక్టర్‌కు ఎనిమిది, ఆయాకు మూడు, రాంక్యాతండాలో ఇన్‌స్ట్రక్టర్‌కు తొమ్మిది, ఆయాకు రెండు దరఖాస్తులు వచ్చినట్లు ఎంఈవో తెలిపారు. వారికి నేడు ఇంటర్వ్యూలు నిర్వహించి పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. విద్యార్హతలు గల ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు.

# ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** వర్షాభావ పరిస్థితుల్లో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి, రైతు శిక్షణా కేంద్ర వ్యవసాయ అధికారి ఇంటూరి భాస్కర్‌రావు లు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని రఘునాథపాలెం, చెరువుకొమ్ము తండా గ్రామాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు యూరియా యాప్ ద్వారా యూరియా బుకింగ్ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు ఉంటాయన్న నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయంగా అపరాలు, చిరు ధాన్యాలు సాగు చేయాలని తెలిపారు. పత్తిలో అంతర పంటలుగా అపరాలు సాగు చేయాలన్నారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించడంతో పాటు ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు లాభం చేకూరుతుందన్నారు. రైతులు యూరియా బుకింగ్ యాప్ ద్వారా మాత్రమే యూరియా బుక్ చేసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం మండలంలో నాలుగువేల బస్తాల యూరియా అందుబాటులో ఉందని అవసరం ఉన్న రైతులు ఈ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవాలని తెలిపారు. మిర్చి, వరి పంటలకు ప్రత్యామ్నాయంగా అపరాలు సాగు చేసుకోవాలని తెలిపారు. ఈ యాప్ ద్వారా యూరియా ఎలా బుక్ చేసుకోవాలో రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ప్రతిభ, రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని శివాయిగూడెం పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ సునీత విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, అల్పాహారం వంటి పథకాలను అమలు చేస్తుందన్నారు. వాటిని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శారద రత్నకుమారి, స్కూల్ కమిటీ ఛైర్మన్ కొమ్ము ఉమా, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వీబీ జీ రామ్ జీ పథకాన్ని రద్దు చేయాలి



**ప్రజాపక్షం/బోనకల్:** ఉపాధీ కూలీలకు నష్టం చేసే వీబీ జీ రామ్ జీ పథకాన్ని రద్దు చేసి ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కలకోట గ్రామంలో చెరువు కట్ట వద్ద పనుల చేస్తున్న ఉపాధీ కూలీలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ భాజపా అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర బడ్జెట్‌లో ప్రతి ఏటా ఉపాధి హామీ పనులకు కేటాయింపులు తగ్గిస్తూ వస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా వలసలు, ఆర్థిక ఇబ్బందులు, ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయని పేర్కొన్నారు. తక్షణమే ఉపాధీ పనుల్లో రెండు సార్లు ఫోటో తీసే విధంగా రద్దు నిలిపివేయాలని కోరారు. ఈ నెల 23న ఉపాధీ కూలీల సమస్యలను పరిష్కరించాలని బికెఎంయు ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించబడుతుందని, కావునా పెద్ద ఎత్తున ఉపాధీ హామీ కూలీలు ధర్నాలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు మాతంగి శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు తోటపల్లి యేసు, సోసైటీ డైరక్టర్ యంగల సుందరరావు, షేక్ జానీ, షేక్ జాన్‌బీ, మాతంగి ప్రమీల, యంగల కృష్ణవేణి, మాతంగి జనార్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రక్రియలో బీఎల్‌ఏల పాత్ర కీలకం

**ప్రజాపక్షం/ఎర్రుపాలెం:** మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం మధిర మార్కెట్ కమిటీ ఛైర్మన్ బండారు నరసింహారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియలో బీఎల్‌ఏల పాత్ర కీలకమని, ఓటర్ జాబితాల పరిశీలనలు, సవరణలు, అభ్యంతరాలు నమోదు, అర్హులైన ప్రతీ ఓటరును జాబితాలో చేర్చేందుకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ఎలిజిబెత్, ఆర్ఐలు రవికుమార్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

## బడిబాటతో సందడిగా మారిన పాఠశాల



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండలంలోని మొగరాలగుప్ప ఎంపీపీఎస్ పాఠశాలలో తెలంగాణ సర్వ శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు స్వరూప భవాని ఆధ్వర్యంలో పాఠశాలను బెలూన్లు, వెల్కమ్ బ్యాక్ టు స్కూల్ ప్లకార్డులతో అలంకరించి విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మూకమామిడి గ్రామ సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మీ ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మీ మాట్లాడుతూ ప్రతి బిడ్డ పాఠశాలకు వెళ్లి చదువుకోవాలని, గ్రామంలో ఒక్క విద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సౌకర్యాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధీర్, బాబు లాల్, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అమ్మ మాట, అంగన్‌వాడి బాట



**ప్రజాపక్షం/పినపాక:** పినపాక మండలంలోని ఈ బయ్యారం గ్రామ పంచాయితీ పరిధిలోని గాండ్లబయ్యారం గ్రామంలో బుధవారం అమ్మమాట, అంగన్‌వాడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు, చిన్నారుల పోషకాహారం, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణ, ప్రీ స్కూల్ విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సావిత్రి, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు మల్లీశ్వరి, ప్రవల్లిక, వెంకట నరసమ్మ, వెంకట లక్ష్మీ, స్థానిక ప్రజలు, మహిళలు, అంగన్‌వాడి సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన జీనత్



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా బుధవారం జీనత్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇంతకుముందు మహబూబాబాద్ పోలీస్ స్టేషన్ ఎస్సైగా విధులు నిర్వహించారు. జూలూరుపాడు ఎస్సైగా దాదాపు రెండేళ్లు గా విధులు నిర్వర్తించిన ఎస్సై బాదావత్ రవి పోలీస్ స్పెషల్ బ్రాంచ్ కొత్తగూడెం కి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై జీనత్ మాట్లాడుతూ. మండల ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదులకు సమన్వయం అందిస్తానని తెలిపారు. సమస్యలు పరిష్కరిస్తూ మండలంలోని శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కృషి చేస్తానని, అదే విధంగా మండలంలోని ప్రజలందరూ పోలీసు వారికి సహకరించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

## ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై శిక్షణ



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండల కేంద్రంలోని బుధవారం ఆర్య వైశ్య కళ్యాణ మండలంలో బూత్ లెవెల్ అధికారులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, సూపర్వైజర్లు, సర్పంచులు, మండల పార్టీ అధ్యక్షులకు ఎన్నికల కమిషన్ ఈ నెల 25వ తేదీ నుండి చేపట్టబోయే సర్ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పైన శిక్షణా కార్యక్రమం మాస్టర్ ట్రైనర్ ల చేత నిర్వహించడం జరిగింది. ఇందులో (సర్) అంటే ఏమిటి, ఓటర్ల సవరణ ఏ విధంగా చేస్తారు. అందులో రాజకీయ పార్టీల బూతు స్థాయి ఏజంట్ల పాత్ర వివరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఖమ్మం నుండి వచ్చిన ముగ్గురు మాస్టర్ ట్రైనర్ లు, తహశీల్దార్, ఎంపీడీఓ పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైరా అసెంబ్లీ నియోజక వర్గ ఎన్నికల అధికారి అయిన శ్రీజ, ఐ. ఎ.ఎస్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఖమ్మం హాజరై, తగు సూచనలు చేశారు.

## నాగేశ్వరరావుకు నివాళి



**ప్రజాపక్షం/మణుగూరు:** ఐఎఫ్‌టీయు జిల్లా నాయకులు, మణుగూరు సుపరిచితులు మిడిదొడ్ల నాగేశ్వరరావు దశదినకర్మలో సిపిఐ నాయకులు ఐఎఫ్‌టియూ, జిల్లా నాయకులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. మిడిదొడ్ల నాగేశ్వరరావు దశదినకర్మ లు బుధవారం ఆయన స్వగృహంలో కూనవరం గ్రామంలో జరిగాయి. ఈకార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్, సీనియర్ నాయకులు ఎస్కే సర్వర్, మంగి వీరయ్య, ఏఐటీయూసీ కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, భీమరాజు కృష్ణ, గోడిశాల రాములు, కణతాల కోటయ్య, లారీ ఓనర్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, ట్రాన్స్ పోర్టు అధ్యక్షులు చంద్రరావు తదితరులు పాల్గొని పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

## మిషన్ భగీరథ పనుల జాప్యంపై కూనంనేని ఆగ్రహం

- రోడ్లు ధ్వంసం, పైపుల లీకేజీలపై అసహనం
- ప్రజలు అవస్థలు పడుతున్నా నిర్లక్ష్యం వీడరా
- పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి
- అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటన



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మిషన్ భగీరథ పైపులైన్ పనుల జాప్యంపై ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు తీవ్ర అగ్రహాన్ని వ్యక్తం చేశారు. గురువారం పాల్వంచ పట్టణంలో జరుగుతున్న పైపులైన్ పనులతో ధ్వంసమైన రోడ్లను అధికార్లతో కలిసి పరిశీలించి రోడ్ల ధ్వంసం, పైపులైన్ల లీకేజీపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ కూనంనేని మాట్లాడుతూ.. ప్రజలు అవస్థలు పడుతున్నా నిర్లక్ష్యం వీడరా అంటూ అధికారులను ప్రశ్నించారు. సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ స్పందించక పోవడం సరైందికాదని, తక్షణమే పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలని ఆదేశించారు. వారం రోజుల్లో మళ్లీ క్షేత్రస్థాయి పర్యటిస్తానని, అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. అంబేద్కర్ సెంటర్‌లో తక్షణమే సిమెంట్ రోడ్డు నిర్మించాలి. ప్రధాన జాతీయ రహదారి అయినందున ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అన్ని శాఖల సమన్వయంతో రోడ్ నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, డిప్యుటీ మేయర్ లలితకుమారి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణ చంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, ఇంచార్జ్ కమీషనర్ విజయానంద్, ఎలక్ట్రికల్ ఏడిఇ ఉబ్బుల్ రహమాన్, కార్పొరేటర్లు వీశంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, నామా కీర్తి, గొర్ల అన్నపూర్ణ, పైడిపల్లి జయలక్ష్మీ, ఎస్ సుగుణ, మల్లెల స్వప్న కుమారి, దంతబోయిన నరేష్, నాయకులు వీ పద్మజ, డి సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, శనగారపు శ్రీనివాసరావు, ఎస్ఏ రెహమాన్, వైవి గిరి, గొర్ల నరేష్, నామ పండు, ఆలపాటి ప్రసాద్, అల్లి వెంకటేశ్వర్లు, వివిధ శాఖల డిఇలు, ఏఇలు, అధికారులు పాల్గొన్నారు.

## యూరియా యాప్ విజయవంతం : పుల్లయ్య




**-ప్రజాపక్షం/కారేపల్లి:** ఖమ్మం జిల్లాలో అమలులో ఉన్న యూరియా బుకింగ్ యాప్ విజయవంతంగా కొనసాగుతోందని, ఎరువుల కోసం రైతులు ఇకపై క్యూలైన్లలో నిలబడాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ అధికారి దనసరి పుల్లయ్య తెలిపారు. బుధవారం కారేపల్లి మండలంలో సొసైటీ ఆధ్వర్యంలోని యూరియా సేల్ పాయింట్లు, విత్తన దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో విత్తన స్టాక్ రిజిస్టర్లు, లైసెన్సులు, బిల్లు పుస్తకాలను పరిశీలించి ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం రైతులతో సమావేశమై మాట్లాడుతూ జిల్లాలో సీజన్‌కు సరిపడ యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. గత ఖరీఫ్‌లో 32వేల టన్నుల యూరియా వినియోగం జరగగా, ఈ ఏడాది 35వేల టన్నులు అవసరమని అంచనా వేయగా ఇప్పటికే 21వేల టన్నులు జిల్లాకు వచ్చిందని, మిగిలిన నిల్వ త్వరలో చేరుతుందని చెప్పారు. వాతావరణ పరిస్థితులపై మాట్లాడుతూ ఎలినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఉండే అవకాశం ఉన్నందున రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎండల సమయంలో విత్తనాలు విత్తవద్దని, పత్తి పంటను జూలై 15వరకు మాత్రమే విత్తుకోవాలని తెలిపారు. భూగర్భ జలాలు తగ్గుతున్న నేపథ్యంలో వరి సాగు తగ్గించి పెసర, మినుము, జొన్న వంటి అరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా, నానో డిఏపీ వినియోగించాలని, తక్కువ ఖర్చుతో అధిక ఫలితం పొందవచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో వైరా ఏడీఓ తుమ్మలపల్లి కరుణశ్రీ, ఏవో అనిల్, ఏఈవోలు నరేష్, మహేష్, మున్నీ, సొసైటీ కార్యదర్శి బొల్లు హనుమంతరావు, ఆత్మ కమిటీ డైరెక్టర్ భూక్య పద్మ పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

-రూ 1.70 కోట్ల అభివృద్ధి పనులకు ఎంఎల్ఏ జారే ఆదినారాయణ శంకుస్థాపన



**ప్రజాపక్షం/ములకలపల్లి:** గ్రామీణ రవాణా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ములకలపల్లి మండలంలో రూ 1.70కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు స్థానిక ఎంఎల్ఏ జారే ఆదినారాయణ బుధవారం శంకుస్థాపన చేశారు. మండలంలోని మూకమామిడి గ్రామ పంచాయితీ పరిధిలోని మూకమామిడి, ఎర్రప్పగుంపు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఘనంగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ రోడ్డు నిర్మాణంతో మూకమామిడి, ఎర్రప్పగుంపు, రంగాపురం గ్రామాల నుంచి మండల కేంద్రానికి రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. ఈసందర్భంగా ఎంఎల్ఏ జారే ఆదినారాయణ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయిన అనంతరం మూకమామిడి పంచాయితీ నుంచి చవిటిగూడెం పంచాయితీ మీదుగా మండల కేంద్రానికి బస్సు సౌకర్యం కల్పిస్తామని, తద్వారా రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలకు పెద్ద ఉపశమనం కలుగుతుందని తెలిపారు. అలాగే మూకమామిడి ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు చేస్తానని, పంచాయితీ పరిధిలో మిగిలిన సీసీ రోడ్ల నిర్మాణానికి కూడా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా మూకమామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మీ పలు సమస్యలపై ఎంఎల్ఏకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎంఎల్ఏ సమస్యల పరిష్కారానికి అధిక నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో తిమ్మంపేట సర్పంచ్ తుర్రం శ్రీనివాస్‌రావు, జగన్నాథపురం సర్పంచ్ కుంజా వినోద్, ఎంపీడీవో రామారావు, తహసీల్దార్ బిందు, ఏఈ సురేష్, పీఆర్ ఏఈ టి శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరప్రసాద్, ఎంపీఓ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేని విత్తనాల విక్రయాలపై కఠిన చర్యలు

-విత్తన దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఏవో



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** అనుమతి లేని కంపెనీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ అధికారి వినయ్ హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని పలు విత్తన విక్రయ దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఏవో వినయ్ షాపు యజమానులకు పలు సూచనలు అందిస్తూ, రైతులకు విక్రయించే ప్రతి విత్తన ప్యాకెట్‌కు తప్పని సరిగా రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. అలాగే షాపులో ఉన్న విత్తనాల స్టాక్ వివరాలను పూర్తిగా నమోదు చేయాలని, ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో అనుమతి లేని వ్యక్తులు విత్తనాలు విక్రయిస్తే అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు. కొనుగోలు చేసిన విత్తనాల రసీదులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని తెలిపారు. ప్రభుత్వ అనుమతి పొందిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అనుమతించిన డీపీటీ 5204, ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటి జై శ్రీరామ్, డబ్ల్యూజీఎల్ 44 962 వంటి వరి వంగడాలను మాత్రమే విక్రమించాలని ఆయన పేర్కొన్నారు. తనిఖీల్లో ఏఈవోలు పాల్గొన్నారు.

# సర్కార్ చదువులు సాగేదెట్లా..!

- పాఠశాలలపై పాలకులకు పట్టింపేదీ..?
- సదుపాయాలకు ఆమడదూరంలో విద్యార్థులు
- జిల్లాలో 707 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ
- 97 పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 10లోపే
- ఒకే విద్యార్థి, ఒక టీచర్ ఉన్న సూళ్లు 9
- ఆట స్థలాలు, వంట షెడ్లు, ప్రహరీ గోడలు నిల్





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో ప్రభుత్వ విద్యకు గ్రహణం పట్టినంత పని అవుతోంది. మొత్తంగా 1079 ప్రభుత్వ పాఠశాలలు 23 మండలాల వ్యాప్తంగా ఉన్నాయి. పట్టణాలు, మండల కేంద్రాలు, వాటికి సమీపాన ఉండే పాఠశాలలు ప్రధాన రహదారికి అతి దగ్గర్లో ఉండే బడులు మినహా అగ్ర భాగం స్కూళ్లలో సరైన మౌళిక సదుపాయాలు లేవంటే అతిశయోక్తి కాదు. కొన్ని ప్రభుత్వ బడులను చూస్తుంటే నవ్విపోదురా గాకా అనే చందంగా ఉంది జిల్లాలో విద్యావ్యవస్థ తీరు. వాస్తవానికి 4412 ఉపాధ్యాయ పోస్టులు ఈ జిల్లాకు అవసరం, కానీ ప్రస్తుతం ఉన్నది 3705 మాత్రమే. ఇకా 707 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఇక పది మందికంటే తక్కువగా విద్యార్థులున్న బడులు 97 వరకు ఉన్నాయి. ఈ బడుల మొత్తంలో 786 మంది విద్యార్థులు ఉండగా, పనిచేస్తున్న ఉపాధ్యాయుల 156 మంది. వీటిలోనే ఒకే ఒక్క విద్యార్థి, ఒక్క టీచర్ ఉన్న బడులు 9 వరకు ఉన్నాయి. ఇక్కడ విద్యార్థుల శాతాన్ని పెంచేందుకు శ్రద్ధ పెట్టడం లేదనే వాదన ఓ ప్రక్క వినిపిస్తున్నా, అంతా గురుకులాల దారిపడుతున్నారంటూ గ్రామాల్లో వినిపిస్తోంది. జిల్లాలో విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వంట చేసేందుకు 384 బడుల్లో షెడ్లు లేవు. ఆరుబయట, చెట్లక్రింద వంటలు చేసి పెడుతుంటారు. వర్షా కాలంలో ఏదో ఒక తరగతి గదిలో వంట చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. లేదంటే ఇళ్ల వద్ద తయారు చేసుకుని తీసుకు రాక తప్పదు. చాలా పాఠశాలల్లో ఆట స్థలాలే లేవు. కొన్నింటికి ఉన్నా చెత్తా చెదారంతో నిండిపోయి, మడుగులు మారుతున్నాయి. వాటిని శుభ్ర పరిచి విద్యార్థుల శారీర ధారుఢ్యానికి, మానసిక వికాసానికి ఆట లాడిద్దామనే సోయి లేకుండా పోతోంది.ఇదిలా ఉండగా పిల్లల ఆటల కోసం క్రీడా సామాగ్రి కొనుగోళ్లకు నిధుల విదిలింపులు అంతంతమాత్రమే. మంచినీటి సదుపాయం అన్ని పాఠశాలకున్నప్పటికీ మరుగుదొడ్లు లేని పాఠశాలలు జిల్లాలో 37 ఉన్నాయి. మరుగుదొడ్ల నిర్వహణ, మరమ్మత్తుల కోసం ఈ మధ్య కాలంలో నూతన కలెక్టర్ అంకిత్ రూ.19 లక్షల 50 వేలను విడుదల చేశారు. సోమవారం నుండే బడులు ప్రారంభ కావడంతో పనులు మొదలు పెట్టాల్సుంది. పూర్తి స్థాయిలో ప్రహరీ గోడలు లేని బడులు 237 ఉండగా, సగం ప్రహరీ ఉన్నవి 136 ఉన్నాయి. పాఠశాల పని గంటలు పూర్తయిన తర్వాత బడులకు రక్షణ లేకుండా పోతోంది. రాత్రి వేళల్లో పశువులు కొట్టాలుగా, ఆకతాయిల ఇష్టాను సారపు ఆటలకు కేరాఫ్ అడ్రస్‌గా, మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. పాఠశాలలకు ప్రహరీ గోడలు నిర్మించి తరగతి గదులను సంరక్షించాల్సిన పాలకులు కనీసం పట్టించుకోక పోవడం విడ్డూరంగా ఉంది. ఇదిలా ఉండగా పిఎం శ్రీ క్రింద ఎంపికైన బడులు జిల్లాలో 24 ఉండగా, వాటికి కేంద్ర ప్రభుత్వం నుండి దశలవారీగా నిధులు మంజూరవుతుంటాయి. ఇలా విడుదలయ్యే నిధులతో బడులను తీర్చి దిద్దాల్సి ఉంటుంది. ఇప్పటికే అన్ని స్కూళ్లలో మౌళిక సదుపాయాలు సమకూర్చారు. రానున్న ఈ విద్యా సం.లో మరిన్ని నిధులు విడుదల చేసి మరికొన్ని హంగులతో తీర్చి దిద్దనుండగా, జిల్లాలో ఇంకొన్ని బడులను పిఎం శ్రీ క్రింద ఎంపిక చేసే అవకాశం ఉంది.

సర్కారు చదువులు సజావుగా సాగాలంటే నిధుల ఎంతో అవసరం. ఈ ఆర్థిక సం.లో రాష్ట్ర ప్రభుత్వ పద్దుల్లో కేవలం 9.8 శాతం నిధుల కేటాయింపు మాత్రమే జరిగింది. మొత్తం రూ.26.647 కోట్లు మాత్రమే. ప్రభుత్వ బడుల దుస్థితి మారాలన్నా, చదువులు గాడిలో పడాలన్నా కనీసం 20 నుండి 25 శాతం నిధుల కేటాయింపులు జరగాల్సి ఉందని నిపుణులు అంటున్నారు. దేశం సమగ్రాభివృద్ధిలోకి పయణించాలంటే తరగతి గదుల్లో తయారయ్యే మేధావులపైనే ఆధార పడి ఉంటుందని, ఇప్పటికైనా పాలకులు ప్రభుత్వ విద్యావ్యవస్థపై దృష్టి సారించాలని విద్యావేత్తలు కోరుతున్నారు.

## బూర్గంపాడులో రూ.65లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం



-సీసీ, గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేసిన పాయం
-ప్రతి గ్రామానికి మెరుగైన మౌలిక వసతులే లక్ష్యం అని స్పష్టం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు అవసరమైన రహదారులు, తాగునీటి సౌకర్యాలు, డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బూర్గంపాడు గ్రామ పంచాయితీ పరిధిలో రూ 65లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం ఎంఎల్ఏ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధికి నాణ్యమైన రహదారులు కీలకమని పేర్కొన్నారు. రోడ్ల నిర్మాణం పూర్తయిన అనంతరం గ్రామ ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు విద్యార్థులు, రైతులు, వ్యాపారులు మరింత ప్రయోజనం పొందుతారని తెలిపారు. అభివృద్ధి ఫలాలు ప్రతి గ్రామానికి చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మౌలిక వసతుల విస్తరణకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ గ్రామాలకు అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడమే తమ సంకల్పమని ఎంఎల్ఏ స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిందితుడికి కఠిన శిక్ష విధించాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** ఖమ్మం నగరంలో మైనర్ బాలికపై జరిగిన దారుణ ఘటనలో నిందితుడిని కఠినంగా శిక్షించాలని, మహిళలు, బాలికల రక్షణకు ఉన్న చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని ఐద్వా వైరా డివిజన్ అధ్యక్షురాలు కొండబోయిన ఉమావతి డిమాండ్ చేశారు. బుధవారం కారేపల్లిలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అత్యాచారానికి గురై తీవ్ర గాయాలతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించడంతో పాటు కుటుంబానికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఖమ్మం ఘటనలో నిందితుడిపై ఫాస్ట్ ట్రాక్ విచారణ జరిపి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఎరువులు, విత్తనాల దుకాణాల్లో తనిఖీలు



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి మండలంలో జిల్లా వ్యవసాయ అధికారి వేల్పుల బాబురావుయ బుధవారం పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా యూరియా నిల్వలు, విత్తనాల నాణ్యతపై ఆయన పరిశీలన జరిపారు. తనిఖీల అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉన్నందున రైతులు పంటల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పత్తి పంటలో అంతరపంటగా కంది(పప్పు దినుసు పంట)సాగు చేయాలని రైతులకు సూచించారు. రైతులు ఆదాయం పెంపు, భూసార పరిరక్షణ దృష్ట్యా పంటల వైవిధ్యీకరణ అవసరమని తెలిపారు. వ్యవసాయ శాఖ సూచించిన పద్ధతులను పాటించడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. అలాగే యూరియా విక్రయాను యాప్ ద్వారా ప్రారంభించామని వెల్లడించారు. ఈవిధానం ద్వారా ఎరువుల పంపిణీలో పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఇల్లు కూలి నిరాశ్రయులైన కుటుంబం



**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండల కేంద్రంలోని బుడుగు బజార్‌లో నివాసం ఉంటున్న బైరోజు కాంతమ్మ, చంద్రయ్య దంపతులకు చెందిన ఇల్లు బుధవారం కురిసిన భారీ వర్షం, ఈదురుగాలుల కారణంగా పూర్తిగా కూలిపోయింది. ఘటన సమయంలో కుటుంబ సభ్యులు అప్రమత్తంగా బయటకు రావడంతో ప్రాణాపాయం తప్పింది. ఇల్లు పూర్తిగా ధ్వంసం కావడంతో కుటుంబం నిరాశ్రయులై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఇంట్లోని గృహోపకరణాలు, నిత్యావసర వస్తువులు కూడా దెబ్బతిన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణ సహాయం అందించి ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## అశ్వాపురం సీఐగా సిలువేరు ఎల్లయ్య



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం పోలీస్ స్టేషన్ నూతన సీఐగా సిలువేరు ఎల్లయ్య బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఐ ఎల్లయ్య మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. అశ్వాపురం మండలంలో ప్రజాభద్రత, ట్రాఫిక్ నియంత్రణ, నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామని ఆయన వెల్లడించారు. ఈకార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సీఐ అశోక్‌రెడ్డికి ఘన సన్మానం



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం పోలీస్ స్టేషన్ సీఐగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న సీఐ గూడా అశోక్‌రెడ్డికి మంగళవారం అశ్వాపురం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ సభ్యులు శాలువాతో సత్కరించి, ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అశ్వాపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వెలమ రాజేందర్ మాట్లాడుతూ సీఐ అశోక్‌రెడ్డి సుమారు రెండున్నర సంవత్సరాల పాటు అశ్వాపురం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు విశేషంగా కృషి చేశారని కొనియాడారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణ, నేరాల అరికట్టడం, ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడంలో ఆయన ప్రత్యేక చొరవ చూపారని తెలిపారు. అదే విధంగా ప్రజల సమస్యల పట్ల సానుకూల దృక్పథంతో స్పందిస్తూ పోలీస్, ప్రజల మధ్య సత్సంబంధాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. మండలంలో జరిగే వివిధ ప్రభుత్వ సామాజిక కార్యక్రమాలలో పాల్గొంటూ ప్రజలకు అందుబాటులో ఉండే అధికారిగా గుర్తింపు పొందారని అన్నారు. సీఐ అశోక్‌రెడ్డి సేవలను గుర్తిస్తూ ప్రెస్ క్లబ్ తరపున ఘన సన్మానం నిర్వహించడం ఆనందంగా ఉందని, ఆయన భవిష్యత్ బాధ్యతల్లో మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు గోపీనాథ్, లెనిన్, సుధీర్, అర్జున్, కోటి, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఏన్కూరు డిప్యూటీ తహసీల్దార్‌గా సులోచన



**ప్రజాపక్షం/ఏన్కూరు:** ఏన్కూరు డిప్యూటీ తహసీల్దార్‌గా ఎం సులోచన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్ఆర్ఎల్ఐ పి కాంతనపల్లి ప్రాజెక్ట్ పాల్వంచ నుంచి ఇటీవల పెనుబల్లికి బదిలీ అయ్యారు. అక్కడి నుంచి ఏన్కూరుకు డిప్యూటేషన్‌పై బదిలీ అయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్ భూసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. రైతులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు.

# పేరుకే పెద్దాసుపత్రి..!

## సమస్యలు ఫుల్.. సదుపాయాలు నిల్...

**-తిరగని ఫ్యాన్లు**
**-తాగునీటి సదుపాయం అంతంతమాత్రమే..**
**-ఇబ్బందులు పడుతున్న రోగులు, బంధువులు**
**-పట్టించుకోని సంబంధిత అధికారులు**



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో కనీస సదుపాయాల లేమి రోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది.



వార్డుల్లో ఫ్యాన్లు పనిచేయకపోవడంతో రోగులు, వారి సహాయకులు ఉక్కపోతతో అవస్థలు పడుతున్నారు. మరోవైపు తాగునీటి సరఫరా కూడా సక్రమంగా లేకపోవడంతో రోగులు బయట నుంచి నీరు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. రోజూ వందలాది మంది రోగులు వైద్యసేవల కోసం ఆసుపత్రికి వస్తుండగా, వారికి అవసరమైన ప్రాథమిక సదుపాయాలు కూడా అందుబాటులో లేకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రి నిర్వహణ, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఫ్యాన్ల మరమ్మతులు చేపట్టడంతో పాటు తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని రోగులు, ప్రజాసంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

## నిర్దేశిత సమయంలోగా దరఖాస్తులను పరిష్కరించాలి

**-టిజి ఐపాస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించిన కలెక్టర్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్:** జిల్లాలో పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పించేందుకు టిజి ఐపాస్ క్రింద వచ్చిన దరఖాస్తులను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ అధికారులతో టిజి ఐపాస్ కమిటీ సమావేశం నిర్వహించి పరిశ్రమల స్థాపన, టిజి ఐపాస్ అనుమతులు, టి ప్రైడ్ పై పథకం అమలుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో టిజి ఐపాస్ విధానం అమలవుతున్న తీరును ఆరా తీశారు. జిల్లాలో పరిశ్రమల అనుమతుల దరఖాస్తులను సకాలంలో జారీ చేయాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు సంబంధించి వివిధ శాఖల అనుమతులకు వేచియున్న ప్రతిపాదనల సమస్యలపై సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలు సైతం తక్షణమే సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో టి ప్రైడ్ పథకం క్రింద నూతనంగా ఏర్పాటు చేసిన 12 ఎస్సి, 13 ఎస్టి యూనిట్లకు ఒక కోటి 35లక్షల 31వేల146 రూపాయలు పెట్టుబడి సబ్సిడిని మంజూరు చేయడం జరిగిందన్నారు. పావలా వడ్డీ క్రింద ఒక ఎస్టి యూనిట్‌కు 46,374 రూపాయల సబ్సిడీ అందించామన్నారు. పరిశ్రమల శాఖ సంక్షేమ శాఖల సమన్వయంతో పథకాలు అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిఎం పరిశ్రమల శాఖ ప్రవీణ్ కుమార్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రవిప్రసాద్, ఆర్టివో శ్రీనివాసరావు, ఇడి ఎస్సి కార్పోరేషన్ ముజాహీద్, డిడి గిరిజన శాఖ విజయలక్ష్మి, విద్యుత్ శాఖ ఎస్‌ఈ శ్రీనివాసాచారి, జిల్లా ఉపాధి కల్పనాధికారిణి మాధవి, పరిశ్రమల శాఖ ఏడి నకుల్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## యూరియా బుకింగ్‌పై అవగాహన కలిగి ఉండాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** రైతులు యూరియా బుకింగ్ యాప్‌పై అవగాహక కలిగి ఉండాలని కూసుమంచి వ్యవసాయ సహాయక సంచాలకుడు సతీశ్ పేర్కొన్నారు. మండలంలోని రాజేశ్వరపురం, నాచేపల్లి, మంగాపురం తండా తదితర గ్రామాల్లో బుధవారం ఆయన అవగాహన సదస్సులు నిర్వహించారు. రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం రైతులు లైన్లలో వేచి ఉండకుండా, ఇబ్బందులు కలగకుండా ఇంటి నుంచే యూరియాను బుకింగ్ చేసుకునేలా తగు చర్యలు తీసుకుంటోందని సూచించారు. విత్తనాలు కొనుగోలు సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతీ కొనుగోలుకు తగు రశీదులు తీసుకోవాలని, ఎలినో తుఫాను ప్రభావంతో కాలాన్ని బట్టి పంటలను ఎంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం.రాధ, చెరువు మాధారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, సొసైటీ ఛైర్మన్ బాలాజీ, రైతు ప్రతినిధులు గోబ్రియా నాయక్, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

## పదేళ్లకు మూడు పాఠశాలలు పునః ప్రారంభం




**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండలంలోని గంగదేవిపాడు పంచాయితీలోని చీన్య తండా, కుప్పెన కుంట్ల పంచాయతీ పరిధిలోని సీతారామపురం, పెనుబల్లి పంచాయతీ పరిధిలోని బిసి కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు గత కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులు లేక మూతపడే ఉన్నాయి. నేడు విద్యాశాఖ అవలంబిస్తున్న కార్యాచరణ మన ఊరు మనబడి వంటి కార్యక్రమాలతో తల్లిదండ్రులను చైతన్యపరిచి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు అన్ని రకాలగా ఆధునిక మెరుగైన వసతులతో పాఠశాలలో తీర్చిదిద్దారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, ఆట పాటలతో ఉత్తమ ఉపాధ్యాయులచే తమ విద్య బోధన వంటి సౌకర్యాల కల్పిస్తున్నామని విద్యాశాఖ అధికారులు అధ్యాపక బృందం తల్లిదండ్రులకు అవగాహన కల్పించి తల్లిదండ్రులను చైతన్య పరిచారు. ఇది గ్రహించిన తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించేందుకు ఆశక్తి చూపారు. మూతపడిన పాఠశాలలు తిరిగి పిల్లలతో కళకళలాడుతున్నాయి. పెనుబల్లి మండల విద్యా అధికారి కావేటి మోహన్ రావు ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రుల సహకారంతో బుధవారం సుదీర్ఘ విరామం అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు పునః ప్రారంభించబడ్డాయి. చిన్యా తండలో పది మంది విద్యార్థులు చేరడంతో అధ్యాపకులు, అధికారులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. రానున్న మూడు నాలుగు రోజుల్లో ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని మండల ఎంఈఓ మోహన్ రావు తెలిపారు.

## డాక్టర్ హిమ ప్రత్యూషకు అంతర్జాతీయ పురస్కారం



**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** అమెరికన్ సొసైటీ ఆఫ్ క్లినికల్ అంకాలజీ (ఎఎస్‌సిఓ) అందించే ప్రతిష్టాత్మక అంతర్జాతీయ అభివృద్ధి, విద్యాపురస్కారానికి ఖమ్మం జిల్లాకు చెందిన యువ వైద్యురాలు డాక్టర్ పారుపల్లి హిమ ప్రత్యూష ఎంపికయ్యారు. క్యాన్సర్ వైద్య రంగంలో ప్రతిభ కనబరిచే యువ వైద్యులను ప్రోత్సహించేందుకు యేటా ఈ అవార్డులను అందజేశారు. ఈ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా నలుగురు మాత్రమే ఎంపిక కాగా, భారతదేశం నుంచి ప్రత్యూషకు ఈ గౌరవం దక్కింది. ఖమ్మంలో జన్మించి పెరిగిన ప్రత్యూష తల్లిదండ్రులు వెంకటనాగలక్ష్మి, అమర్‌చంద్‌లు ఇద్దరు న్యాయవాదులు. చిన్నప్పటి నుంచి వైద్య రంగంలో సేవ చేయాలనే లక్ష్యంతో చదువుకొని ఖమ్మంలోని మమత మెడికల్ కాలేజ్‌లో ఎంబిబిఎస్ పూర్తి చేశారు. అనంతరం విజయవాడలో ఎండీ(జనరల్ మెడిసిన్) పూర్తి చేసి, ప్రస్తుతం ఉస్మానియా మెడికల్ కాలేజ్‌లో డిఎం(మెడికల్ అంకాలజీ) చదువుతున్నారు. అమెరికాలోని చికాగో నగరంలో జరిగిన కార్యక్రమంలో ఆమె ఈ అవార్డు అందుకున్నారు. ఈ పురస్కారం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నిపుణులతో కలిసి పనిచేసే అవకాశం లభించనుంది. ఈ సందర్భంగా డాక్టర్ హిమ ప్రత్యూష మాట్లాడుతూ క్యాన్సర్ రోగుల జీవితాలను మెరుగపరచడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా బ్లడ్ క్యాన్సర్ చికిత్సలో అధునిక విధానాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు రోగులు మరియు వారి కుటుంబ సభ్యులు ఎదుర్కొనే సామాజిక, మానసిక సమస్యలపై పరిశోధనలు చేసి వారికి మరింత మెరుగైన సంరక్షణ అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. వైద్యం చేయడమే కాకుండా రోగి అవసరాలను గుర్తించి సమగ్ర సంరక్షణ అందించాలని ఆమె అన్నారు.

## కేటీఆర్ వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ నాయకులు




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై కేటిఆర్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ ఖమ్మంరూరల్ మండల అధ్యక్షుడు తోట వీరభద్రం, ఏదులాపురం మున్సిపాలిటీ అధ్యక్షుడు బానోత్ కిషోర్ బుధవారం ఓ ప్రకటనలో ఖండించారు. కేటీఆర్ అధికారంపోయిందనే అక్కసుతో పొంగులేటిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. పది సంవత్సరాల పాలనలో పేదలకు ఇండ్లు కట్టలేని మీరు లక్షల పేదల ఇండ్లను కట్టించిన, కట్టిస్తున్న మంత్రిపై మాట్లాడటం సరికాదన్నారు. ఈ అహంకారం, దోపిడీపై ప్రజలు ఒకసారి కర్రు కాల్చి వాతపెట్టారని, మరోసారి కూడా వాత పెట్టేందుకు సిద్దంగా ఉన్నారన్నారు. మరో మారు ఇలానే మాట్లాడితే తప్పకుండా కాంగ్రెస్ శ్రేణులు అడ్డుకుంటారని హెచ్చరించారు.

## మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేకుంటే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్నభోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవిబాబు హెచ్చరించారు. మండలంలోని గువ్వలగూడెం ప్రభుత్వ పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, వంట గదులు, తరగతి గదులను పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులను భోజనం గురించి వివరాలు అడిగి తెలుసుకుని, వారితో కలిసి భోజనం చేశారు. ప్రభుత్వం అందించిన మెనూ ప్రకారం భోజనాలు పెట్టకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రావెళ్ల జ్యోతి, ఎంపీడీఓ ఎం.ఎర్రయ్య, ఎంఈఓ బి.చలపతి రావు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** పారిశుద్ధ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం డివిజనల్ పంచాయతీ అధికారి(డీఎల్‌పీఓ) విజయలక్ష్మి సూచించారు. మండలంలోని చెరువుమాదారం, భైరవునిపల్లి గ్రామాల్లో బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీ కార్యాలయాల్లోని పలు రికార్డులను, ప్రకృతివనాలను, నర్సరీలను పరిశీలించారు. నర్సరీలోని ప్రతీ మొక్క లెక్క ఉండాలని, నీటి నిల్వలు ఉండకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. వర్షాకాల నేపథ్యంలో సీజనల్ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సర్ కార్యక్రమంలో నిర్లక్ష్యం చేయకుండా పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ఎం.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు జీ.రవి, బీ.బాషా తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తుందని ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు బి. శ్రీమన్నారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, సర్పంచ్ కాపా ఆదినారాయణ విద్యార్థులకు నోటుపుస్తకాలు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటుకు దీటుగా నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, అల్పాహారం వంటి సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. తల్లిదండ్రులు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



**- ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపేయాలి**
**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, ఏఐటియూసి రాష్ట్ర నాయకులు సింగు నర్సింహారావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో ఏఐటియూసి జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై మండిపడ్డారు. విద్యుత్ సవరణ బిల్లును, న్యూక్లియర్ చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని స్పష్టం చేశారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని పాత పద్దతిలోనే పునరుద్దరించాలని కోరారు. వందశాతంఫారస్ డిస్ ఇన్వెస్ట్మెట్ ఇన్సూరెన్సు చట్టాలను, వికసిత భారత్, శిక్షా అభియాన్ బిల్లు 2025ను పూర్తి గా ఉపసంహరించుకోవాలన్నారు. దేశంలో లాభాల్లో నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రైవేటీకరణ చర్యలను మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగులను ఆదుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో సేవలు అందిస్తున్న అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, ఎన్‌హెచ్‌ఎం కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఏఐటియూసి అనునిత్యం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటియూసి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కంచర్ల జమలయ్య, నరాటి ప్రసాద్, సలిగంటి శ్రీనివాస్, గోనె మణి, విజయలక్ష్మి, నేరెళ్ల రమేష్, భూక్యా శ్రీనివాస్, జక్కుల రాములు, మల్లిఖార్జునరావు, నజీర్ అహ్మద్, నిర్మల, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# రైతులందరికీ ఎరువులు అందించడమే ప్రభుత్వ లక్ష్యం



**- జిల్లా కలెక్టర్ అంకిత్**

**ప్రజాపక్షం/టేకులపల్లి :** రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా బుకింగ్ యాప్‌ను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. బుధవారం ్ధవారం మండలం బేతంపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో కలెక్టర్ యాప్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు శాసన సభ్యులు కొరం కనకయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ అవసరాల కోసం సుమారు సుమారు 40 వేల మెట్రిక్ టన్నుల యూరియా అసరం అవుతుందని, ప్రస్తుతానికి 15వేల మెట్రిక్ టన్నులు లో ఉందన్నారు. రైతులు అవసరమైన మేరకు యూరియా సరఫరా చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడు తోందన్నారు. యూరియా అవసరానికి మించి వినియోగించడం వల్ల భూ సార సాంధ్రత తగ్గిపోవడంతో పాటు భవిష్యత్‌లో అధిక మొత్తంలో ఎరువులు వినియోగించాల్సి ఉంటుందన్నారు. రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకు సమతుల్య ఎరువుల వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో ఈ ఏడాది రికార్డు స్థాయిలో మొక్క జొన్న సాగు జరిగిందని, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు పంటల వైవిద్యీకరణ, పంట మార్పిడి పద్ధతులు పాటించాలని సూచించారు. అనంతరం కొరం కనకయ్య మాట్లాడుతూ ప్రతీ రైతుకు తగినంత ఎరువులు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని చెప్పారు. యూరియా బుకింగ్ యాప్‌ను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం యాప్ ద్వారా రైతులు బుక్ చేసుకున్న యూరియాను ఎంఎల్‌ఏ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ లక్కినేని సురేంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, సర్పంచ్ బోడా బాలు, కొత్తగూడెం ఆర్‌డిఓ మధు, సహకార శాఖ అధికారి శ్రీనివాస్, వ్యవసాయాధికారి బాబూరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఫుడ్ పార్క్ భూముల అమ్మకాలపై సిబిఐ, సివిసి దర్యాప్తు జరగాలి




**బిజెపి నేత పొంగులేటి సుధాకర్ రెడ్డి**

**ప్రజాపక్షం/సత్తుపల్లిః** కారు చౌకగా ఫుడ్ పార్క్ భూములు అమ్మకాలపై తక్షణమే సిబిఐ, సివిసి విచారణ జరగాలన్నారు భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకులు, కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల కోఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి. బుధవారం సత్తుపల్లి మండలం బుగ్గపాడు గ్రామంలోని ఫుడ్ పార్క్‌ను బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావుతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడ జరుగుతున్న వ్యవహారాలను, నిర్మాణాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఫుడ్ పార్క్ వ్యవహారంలో పారదర్శకత పూర్తిగా లోపించిందని, ఈ భారీ అక్రమాల వెనుక ఈ ప్రాంతానికి చెందిన ముఖ్య నాయకుల ప్రమేయం స్పష్టంగా కనిపిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. వ్యవసాయ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధి కోసం, స్థానిక రైతులకు అండగా నిలుస్తుందనే ఆశతో ఏర్పాటు చేసిన సత్తుపల్లి మెగా ఫుడ్ పార్క్ చివరకు పెద్ద కుంభకోణానికి వేదికగా మారిందన్నారు. మెగా ఫుడ్ పార్క్ స్కీమ్ కింద కోల్డ్ స్టోరేజీతో కూడిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును వ్యవసాయ ఆధారిత ప్రొడక్ట్ ల కోసం, రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందనే ఉద్దేశంతో రూ.109.50 కోట్ల అంచనా వ్యయంతో రూపకల్పన చేశారని పొంగులేటి గుర్తు చేశారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని కాంక్షించి తన వంతుగా ఏకంగా రూ.49.70 కోట్ల భారీ నిధులను కేటాయించిందని స్పష్టం చేశారు. ఈ ఫుడ్ పార్క్ ఉదంతంలో జరిగిన ప్రతి ఒక్క అక్రమాన్ని బయటకు తీయాల్సిందేనని, ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే తక్షణమే దీనిపై పూర్తి వివరాలతో కూడిన శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని పొంగులేటి సుధాకర్ రెడ్డి గట్టిగా డిమాండ్ చేశారు. ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు సూత్రధారులు, పాత్రధారుల ముసుగులు తొలగించి, వారిని సమాజం ముందు నిలబెట్టే వరకు బీజేపీ విశ్రమించబోదని హెచ్చరించారు. ఈ వ్యవహారంపై కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) ద్వారా సమగ్ర దర్యాప్తు చేయిస్తామని, అవసరమైతే కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) చేత కూడా దర్యాప్తు జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరతామని స్పష్టం చేశారు. తాను ఈ జిల్లా వాసిగా ఇక్కడి రైతులకు జరిగిన అన్యాయాన్ని, దోపిడీని చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని, బాధితులకు న్యాయం జరిగే వరకు క్షేత్రస్థాయి నుండి ఢిల్లీ స్థాయి వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన పునరుద్ఘాటించారు. అంతకు ముందు సత్తుపల్లి సమీపంలోని గ్రీన్ ఫీల్డ్ హైవేపై మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావుతో పాటు రాష్ట్ర అధికార ప్రతినిధి నంబూరి రామలింగేశ్వరరావు, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రుద్ర ప్రదీప్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జొన్నలగడ్డ నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు, జిల్లా కార్యదర్శి వీరంరాజు, సత్తుపల్లి మండల, పట్టణ అధ్యక్షులు బానోతు విజయ్, శాలి శివకృష్ణ, వేంసూర్ మండల అధ్యక్షులు గొర్ల ప్రభాకర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు పరస రాంబాబు, రఘునాథ రెడ్డి, భీమిరెడ్డి బాలకృష్ణారెడ్డి, బండి వెంకటరెడ్డి, నల్లమోతు నాని బాబు, కొప్పుల మధుసూదన్ రెడ్డి , వేముల లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

# బడిబాటలో పాల్గొన్న సమితి సింగారం సర్పంచ్

**ప్రజాపక్షం/మణుగూరుః** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థ నమోదు పెంచేందుకు ప్రభుత్వం విద్యను బలోపేతం చేసేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమం షెడ్యూల్లో బుధవారం సంత సింగారం పంచాయతీలో పిల్లలకు టెస్ట్ బుక్స్, నోట్ బుక్స్ మరియు సామూహిక అక్షరాభ్యాసం చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించు పవిత్ర కార్యక్రమంలో సర్పంచ్ కలబోయిన మాధవరావు, వార్డు సభ్యులు మాదాడి రాజేష్, కార్యదర్శి అశోక్, స్కూల్ హెచ్‌ఎం కిషోర్, టీచర్ పాల్గొన్నారు.

# నేడు ప్రజలతో ఎంఎల్‌ఏ కూనంనేని ముఖాముఖి

**- పాల్వంచ మున్సిపల్ కార్యాలయంలో మన కోసం మన ఎంఎల్‌ఏ కార్యక్రమం**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజలకు పాలనను మరింత దగ్గర చేయాలనే ఉద్దేశ్యంతో ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు నేడు ప్రజలతో ముఖాముఖి నిర్వహించనున్నారు. పాల్వంచ మున్సిపల్ కార్యాలయంలో ఉ11.గ ం. నుండి మన కోసం మన ఎంఎల్‌ఏ కార్యక్రమంలో భాగంగా ఈ ముఖాముఖి కార్యక్రమం జరగనుంది. ఈ ముఖాముఖికి ప్రజలు, రాజకీయ నాయకులు, అధికారులు, మీడియా ప్రతినిధులు హాజరు కావాలని ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయం నుండి ప్రకటన విడుదల చేశారు.

# పైవేట్ పాఠశాలకు పిల్లలను పంపొద్దని తీర్మానం



**ప్రజాపక్షం/గుండాల :** గుండాల మండలపరిదిలోని లింగగూడెం గ్రామపంచాయితి సర్పంచి చింతా వెంకటేశ్వర్లు అధ్యక్షతన బుదవారం పాలకవర్గ సమావేశం నిర్వహించి ప్రైవేటి పాఠశాలలకు తమపిల్లలను పంపవద్దని ప్రభుత్వ పాఠశాలలకే పంపాలని ఏకగ్రీవ తీర్మాణం చేశారు.ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ప్రవేటి పాఠశాలల్లో నిరుపేద గిరిజన విద్యార్థుల అమాయకత్వాన్ని ఆసరాగ చేసుకొని అధిక ఫీజులు తీసుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వపాఠశాలల్లో క్వాలిఫైడ్ అయిన పాధ్యాయులు ఉన్నారని, ప్రైవేటిపాఠశాలలో ఇంటర్, డిగ్రి చదువుకున్న వారితో విద్యాబోదన జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో బుక్స్, యూనిఫాం, ఉచితబోజనం, వంటి అనేక సౌకర్యాలను ప్రభుత్వం కల్పించిందని దానిని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. ప్రైవేటి పాఠశాల్లో చదువుతక్కువ దోపిడి ఎక్కువజరుగుతుందని ఇక్కడి నిరుపేద గిరిజనులు గమనంలోకి తీసుకొని తమపిల్లలను మన ప్రభుత్వ పాఠశాలకు పంపిచించి మెరుగైన విద్యను అందించేలా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయితి పాలక వర్గసభ్యులు పాల్గొన్నారు.

# సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌కు ఘన సన్మానం



**ప్రజాపక్షం/ఏన్కూరు:** ఖమ్మం జిల్లా సుడా చైర్మన్‌గా నియమితులైన పువ్వాళ్ల దుర్గప్రసాద్‌ను ఏన్కూరు మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైరా కమ్మవారి కళ్యాణ మండపంలో బుధవారం అభినందన సభను ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ నాయకులు అయ్యప్ప స్వామి ఆలయం నుంచి ర్యాలీగా సభకు చేరుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వైరా ఎంఎల్‌ఏ మాలోత్ రాందాస్ నాయక్‌తో కలిసి నాయకులు పువ్వాళ్ల దుర్గ ప్రసాద్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు ఆయన నియామకం జిల్లాలకు గర్వకారణమని పేర్కొంటూ శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ సెక్రటరీలు కొప్పుల ప్రభావతిరెడ్డి, తంబళ్ల సామేలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుగులోత్ లచ్చిరామ్ నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్, మాజీ ఎంపీటీసీ మేడ ధర్మారావు, నాయకులు చందమామ నరసింహారావు, షేక్ నన్నేఖాన్, వర్ణబోయిన నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యపై నమ్మకానికి నిదర్శనం..!

**-తన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించిన ఉపాధ్యాయుడు**



**ప్రజాపక్షం/దమ్మపేట:** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని చెబుతూ, అదే విషయాన్ని తన ఆచరణతో నిరూపించిన ఉపాధ్యాయుడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం నాగుపల్లి జెడ్‌పిహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు ఎం కీర్య. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల వైపు తల్లిదండ్రులు మొగ్గుచూపుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో, తాను పని చేస్తున్న నాగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనే తన పిల్లలను చేర్పించి ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని చాటిచెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు, మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య అందుబాటులో ఉన్నాయని ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సమయంలో ఆయన తీసుకున్న నిర్ణయం అందరి ప్రశంసలు అందుకుంటోంది. ఉపాధ్యాయులు ఎం కీర్య తీసుకున్న ఈ ఆదర్శవంతమైన నిర్ణయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి సరళ, సహచర ఉపాధ్యాయులు, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు, నాగుపల్లి గ్రామ ప్రజలు అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో మరింత విశ్వాసం పెంపొందించేందుకు ఇది దోహదపడుతుందని, భవిష్యత్తులో పాఠశాలలో విద్యార్థుల చేరికలు పెరగడానికి ఈ చర్య ప్రేరణగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు.

**చెప్పడమే కాదు..చేసి చూపిన ఉపాధ్యాయుడు...**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలపై సమాజానికి సానుకూల సందేశం ఇచ్చిన ఎం కీర్య చర్య, ఇతర తల్లిదండ్రులకు కూడా ఆదర్శంగా నిలుస్తోందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ విద్యపై విశ్వాసాన్ని పెంచే ఈ నిర్ణయం విద్యారంగంలో చర్చనీయాంశంగా మారింది.

# జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** జూన్ 20వ తేదీన జరుగనున్న జాతీయలోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పోలీసు కమిషన్ సునిల్‌దత్ విజ్ఞాప్తి చేశారు. చిన్నవివాదాలకు స్టేషన్ల చుట్టు తిరిగి ఆర్థికంగా నష్టపోకుండా, సమయాన్ని వృధాచేసుకోకుండా ఇరువర్గాల సమ్మతితో సమస్యను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూంచించారు. రాజీ చేసుకునే అవకాశం ఉన్న వివిధ రకాల కేసులు, క్రిమినల్ కంపౌండబుల్, సివిల్ తగదాలు, ఆస్థి విభజన కేసులు, వైవాహిక జీవితం, కుటుంబ సమస్యలు, డ్రంకెన్‌డ్రైవ్, మోటారు వాహనచట్టం ఉల్లంఘన, చెక్‌బౌన్స్, బ్యాంక్ రికవరీ, విద్యుత్‌చౌర్యం తదితర కేసులను జాతీయలోక్ ఆదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు. న్యాయశాఖ అందిస్తున్న ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని సిపి విజ్ఞప్తి చేశారు.

# పాఠశాలల మూసివేతను ఉపసంహరించుకోవాలి

**-రేవంత్ పాలనలో నిర్వీర్యమవుతున్న ప్రభుత్వ విద్య**
**-ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంత్రి కార్యాలయం ముట్టడి, ఉద్రిక్తత**





**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రభుత్వ పాఠశాలల మూసివేతను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వ విద్య బలోపేతానికి చర్యలు చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్య నిర్వీర్యమైతే భవిష్యత్తులో ఓ తరం విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం విద్యా సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయాన్ని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ముట్టడించారు. ఈ సందర్భంగా పోలీసులకు, విద్యార్థి సంఘ నాయకులకు మధ్య తోపులాట జరిగింది. పలువురు నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగాజరిగిన ఆందోళనను ఉద్దేశించి ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రుల్లో నమ్మకం కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. బడిబాట రాష్ట్ర వ్యాప్తంగా తూతూ మంత్రంగా జరుగుతుందని ప్రభుత్వ విద్య బలోపేతానికి బడిబాట కార్యక్రమం సరిపోదన్నారు. ప్రైవేటు విద్యా సంస్థలను నియంత్రించడంతో పాటు ప్రభుత్వ విద్యపై భరోసా ఇవ్వాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని గత ప్రభుత్వం ఇదే విధానాలను అవలంభించి ప్రజల విశ్వసనీయతను కోల్పోయిందని ఆయన తెలిపారు. పాఠశాలల కుదింపును ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు మార్కెట్ కేంద్రాలను తలపిస్తూ విద్యను వ్యాపారమయం చేశాయని అయినా నియంత్రించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ విద్యార్థులకు 25 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని ఉల్లంఘిస్తున్నారన్నారు. రకరకాల పేర్లతో జరుగుతున్న విద్యా దోపిడీని అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మదుపల్లి లక్ష్మణ్, నాయకులు లోకేష్, మనోజ్, పవన్, గోపి, రాము, ఉమేష్, నరేందర్, సాయి, అభిరాం, వెంకట్ పాల్గొన్నారు.

# విద్యార్థులు లేక మూతబడ్డ ఆరు ప్రాథమిక పాఠశాలలు



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** మండలంలో ప్రభుత్వ పాఠశాలలు గాడి తప్పుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలను గాడిన పెట్టి విద్యార్థుల సంఖ్య పెంచి పటిష్టంగా తీర్చిదిద్దే పనిలో ప్రభుత్వం ఉన్నప్పటికీ తిరుమలాయపాలెం మండలంలో మాత్రం ఆచరణ సాధ్యం కావట్లేదు. తమ పిల్లల భవిష్యత్తు మెరుగుపరచడం కోసం తల్లిదండ్రులు కాయకష్టం చేసి, అప్పులపాలవుతూ ప్రైవేట్ పాఠశాలలకు పంపుతూ అందకారంలో జీవిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం రూ.కోట్లు వెచ్చించి నిర్వహిస్తుంటే..మండలంలో మాత్రం విద్యార్థులు లేక ఆరు ప్రాథమిక పాఠశాలలు మూతబడ్డాయి. జల్లేపల్లి కాంప్లెక్స్ పరిధిలో అజ్మీర తండా, జోగులపాడు, రావిచెట్లు తండా, బచ్చోడు కాంప్లెక్స్ పరిధిలో నాయకన్ తండా, మంగళబండ తండా, వాంకడోత్ తండా మొత్తం ఆరు ప్రాథమిక పాఠశాలలో గత నాలగేళ్లుగా మూతబడ్డాయి. ఆ పాఠశాల పరిధిలో విద్యార్థులను వారి తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు పంపించడంతోనే పాఠశాలలు మూతబడ్డాయని మండల విద్యా అధికారులు తెలిపారు. ప్రాథమిక పాఠశాల నుంచే ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తే తల్లిదండ్రులు అప్పులపాలు కావడం ఖాయమని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచి, పాఠశాలలపై నమ్మకం కలిగించాల్సినవసరం ఎంతైనా ఉందని తల్లింద్రులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మూతబడ్డ పాఠశాలల భవనాలల్లో గ్రామపంచాయతీ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు,ప్రజాపంపిణీ రేషన్ దుకాణాలు నిర్వహిస్తున్నారు. మండలంలో పలు ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా నిర్వమిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. విద్యార్థులకు కనీస సౌకర్యాలే ఏర్పాటు చేయకుండా, వ్యాన్లకు ఫిట్‌నెస్ తనిఖీలు మాత్రం చేయడం లేదని, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నప్పటికీ జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకొని ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకల్గించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు భావిస్తున్నారు.

# సుడా చైర్మన్ దుర్గాప్రసాద్‌కు ఘన సన్మానం





**ప్రజాపక్షం/వైరా:** వైరాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఖమ్మం, స్థంభాద్రి అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ(సుడా) చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, బాధ్యతలు చేపట్టి తొలిసారి వైరాకి వచ్చిన సందర్భంగా కమ్మవారి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ ఇందుమతి దంపతులను ఘనంగా సన్మానించారు. తొలుత పరుచూరి గార్డెన్ వద్ద దుర్గాప్రసాద్‌కు కాంగ్రెస్ శ్రేణులు భారీగా స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. అనంతరం వైరా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో రాష్ట్ర హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ , కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ, ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని అన్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సారధ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పార్టీ కార్యకర్త నుంచి సర్పంచ్‌గా, గ్రంధాలయ సంస్థ చైర్మన్‌గా, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా, సుడా చైర్మన్‌గా ఉన్నతమైన పదవులు అందుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సముద్రం లాంటిదని పార్టీ కోసం పనిచేసే ప్రతిఒక్కరికి పదవులు వస్తాయని అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేసి 9 అసెంబ్లీ స్థానాలు గెలుచుకునేందుకు కృషి చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్‌గాంధి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క సారధ్యంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఖమ్మం స్థంభాద్రి అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో వైరాకు అధిక నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానని అన్నారు. తనకు ఈ ప్రాంతవాసిగా గుర్తించి భారీస్థాయిలో అభినందన కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, హస్తకళల చైర్మన్ నాయుడు సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ, డాక్టర్ సెల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, మహిళా జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు, సాయి, నూతి వెంకటస్వామి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, టౌన్ అధ్యక్షులు సీతారాములు, ఆత్మ చైర్మన్ మట్టూరి వెంకటేశ్వర్లు, ముళ్ళపాటి సీతారాములు, రాంపూడి రోశయ్య, పమ్మి అశోక్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు శీలం చంద్రశేఖర్‌రెడ్డి, వీరంశెట్టి సీతారాములు, కౌన్సిలర్ ఫణితి సైదులు, కౌన్సిలర్ ముళ్ళపాటి విజయ, కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి , మచ్చా బుజ్జి, పూసలపాడు సొసైటీ చైర్మన్ గాలి శ్రీనివాసరావు, వుంద్రు శ్యామ్‌బాబు, సర్పంచ్ జవ్వాజి అశ్విని, పాలేటి నర్సింహారావు, కొల్లి రమేష్, జవ్వాజి నాగరాజు, పల్లపు కొండలు, బత్తుల గీత, ఫణితి శ్రీను, పలువురు సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# 23న జరిగే ధర్నాను జయప్రదం చేయండి

**-తాటి వెంకటేశ్వర్లు**



**ప్రజాపక్షం/ఖమ్మం :** విబిజిరాం జీ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 23న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తాటి వెంకటేశ్వరరావు కోరారు. బుధవారం కామేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి విబిజి రాంజీ పథకం వల్ల జరిగే నష్టాలను ఉపాధి హామీ కూలీలకు వివరించారు. ఈ సందర్భంగా పలు చోట్ల జరిగిన సమావేశాల్లో తాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టాన్ని రద్దు చేయాలని రోజు వారి వేతనం రూ.700 ఇవ్వడంతో పాటు ఏడాదికి పని దినాలను 200లకు పెంచాలని ఆయన కోరారు. విబిజి రాంజీ పథకాన్ని రద్దు చేయకపోతే భవిష్యత్తులో ఉపాధి హామీ కూలీలు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే చట్టాన్ని సవరించి పలు ఇబ్బందులు తెచ్చిపెట్టారని భవిష్యత్తులో దీనిని రద్దు చేసే అవకాశం ఉందని పోరాడి ఈ పథకాన్ని కాపాడుకోవాలని ఆయన కోరారు. 23న జరిగే ధర్నాకు ఉపాధి హామీ కూలీలు కదిలి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు ఏపూరి లతాదేవి, సిపిఐ నాయకులు షేక్ మోహినుద్దీన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆవుల వెంకయ్య మృతి సిపిఐకి తీరని లోటు



**ప్రజాపక్షం/చింతకాని :** సిపిఐ సీనియర్ నాయకులు ఆవుల వెంకయ్య మృతి సిపిఐ పార్టీకి తీరని లోటని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బస్వాపురం గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు ఆవుల వెంకయ్య అనారోగ్యంతో బుధవారం ఉదయం మరణించారు. విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా సహాయకార్యదర్శి జమ్ముల బస్వాపురం చేరుకుని వెంకయ్య మృతదేహంపై పార్టీ జెండా ఉంచి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, మాజీ ఎంపీపీ బండి సత్యం, పార్టీ జిల్లా సమితి సభ్యులు రాసాల మోహన్‌రావు, డీసీసీబి మాజీ అధ్యక్షులు కూరాకుల నాగభూషణం, బస్వాపురం సర్పంచ్ ఆవుల నర్సింహారావు, మండల సహాయ కార్యదర్శి మార్గం శ్రీను, ఉపసర్పంచ్ చంద్రకాని నర్సింహారావు శాఖ కార్యదర్శి బద్దల నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం బహిరంగ సభా వేదిక స్థల పరిశీలన



**ప్రజాపక్షం/చింతకాని :** సీఎం రేవంత్ రెడ్డి ఈనెల 26న మధిర నియోజకవర్గం చింతకాని మండలంలో పర్యటించనున్న నేపధ్యంలో సభ నిర్వహించేందుకు మండలంలో పలు ప్రదేశాలను అధికారులు బుధవారం పరిశీలించారు. మండల పరిధిలోని రామకృష్ణాపురం, మత్కేపల్లి క్రాస్‌రోడ్, లచ్చగూడెం స్టేడియం, పాతర్లపాడు లో కంచుమర్తి రామకృష్ణ వ్యవసాయ క్షేత్రాన్ని అధికారులు పరిశీలించారు. రవాణా కనెక్టివిటీ, విఐపీ కాన్వాయ్, హెలీప్యాడ్ వంటి అంశాలను అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీపీవో రాంబాబు, తహసీల్దార్ బాబ్జీప్రసాద్, ఎంపీడీవో చుంచు శ్రీనివాసరావు, ఎస్సై జి నరేష్, మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కన్నెబోయిన గోపీ, ఆత్మ కమిటీ డైరక్టర్లు కొప్పుల గోవిందరావు, తోటకూరి ప్రగతి, మండల అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్, చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్, మార్కెట్ కమిటీ డైరక్టర్లు షేక్ ఖాసీం, బందెల నాగార్జున, నాయకులు, పూనాటి కృష్ణారావు, మడిపల్లి రాంప్రసాద్, గొడుగు రమేష్, వంగూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. బుధవారం మండల పరిధిలోని శివాయిగూడెం, జికె బంజర గ్రామాల్లో కళ్యాణలక్ష్మి పథకం క్రింద మంజూరైన చెక్కులను లబ్దిదారులకు ఆత్మ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ది చేకూరుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొంటెముక్కల నాగేశ్వరరావు, భూక్యా లాలు, బాసు, బీమా తదితరులు పాల్గొన్నారు.

# తిర్లాపురంలో ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** చింతకాని మండల పరిధిలోని తిర్లాపురం గ్రామంలో బుధవారం వాసన్ ఐకేర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చేపలమడుగు వీరబాబు శిబిరాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా చింతకాని ఎస్ఐ నరేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు శిబిరాలు ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. శిబిరాల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందించడంతో పాటు మందులు కూడా ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. సర్పంచ్ వీరబాబు మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆరోగ్యం మరింత మెరుగుపడేందుకు భవిష్యత్తులో మరిన్ని వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంపు నిర్వహకులు వెంకటేష్, గ్రామ కార్యదర్శి ఉమారాణి, వార్డు సభ్యులు మధు, విజయ, ఆశా వర్కర్ రాణి, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు నాగరత్నం, గ్రామదీపిక, గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.